


# డోంట్ లీవ్ మీ, డియర్!

తిరుమలశ్రీ

ఆహ్లాదకరమైన ఓ సాయంత్రపువేళ...

ఆనందానుభూతులను అందించే ఓ జూలాజికల్ పార్క్‌లో...

అందాలను చిందించే అమ్మాయిలు కొందరు దాగుడుమూతలు ఆడుతున్నారు

ఆరతి కళ్ళకు గంతలుకట్టి, చుట్టూ చేరి "నన్ను ముట్టుకో" అంటూ అల్లరిగా కేరింతలు కొడుతూ ఆమెను ఏడిపిస్తున్నారు ఆమె స్నేహితురాళ్ళు.

ఆరతి కూడా పట్టుదలతో స్నేహితురాళ్ళను అందుకుని అవుట్ చేయాలన్న ఆరాటంతో మృదుహస్తాలను ముందుకు చాచి, అప్పుడే నడకనేర్చిన పాపాయిలా తప్పటడుగులతో ముందుకు నడుస్తోంది.

అలా కొంతసేపు ప్రయత్నించిన పిదప హఠాత్తుగా చేతికందిన శాల్తీని గట్టిగా కౌగలించుకుని 'ఔట్!' అంటూ అరిచింది ఆనందంగా.

గొల్లున నవ్వి చప్పట్లు చరిచారంతా.

వారి అల్లరికి కారణం అర్థంకాక ఒక చేత్తో చటుక్కున కళ్ళ గంతలు లాగేసుకుంది ఆరతి.

మరుక్షణంలో త్రుళ్ళిపడిందామె.

తన కౌగిట్లో బందీ అయినది తన స్నేహితురాలు కాదు—

ఎవరో అపరిచితుడు!

కళ్ళెదుట పామును చూసినదానిలా అప్రయత్నంగా వెనక్కి అడుగువేసింది

"సారీ!" అంటూ ఆమె వంక చిరునవ్వుతో చూసాడు అతను.

ఆరడుగుల ఎత్తు, దృఢమైన శరీరం, వంకీ క్రాఫు, అందమైన మీసకట్టు, నవ్వే కన్నులు, పాతికేళ్ళ స్ఫురద్రూపం, చక్కటి పర్సనాలిటీతో హ్యాండ్‌సమ్‌గా వున్న ఆ యువకుని చూస్తుంటే ఆరతి హృదయంలో ఎక్కడో తీపి తలపులు రేగాయి.

ఓ క్షణం వారి చూపులు కలుసుకున్నాయి.

స్నేహితురాళ్ళ నవ్వుల పువ్వులకు తత్తరపాటుతో చటుక్కున చూపులు తిప్పుకుంది ఆరతి.

"ఓహ్! సారీ..." అన్నాడతను.

కౌగిలిలోని మాధుర్యం హృదయాన్ని పరవశింపజేస్తుంటే ఎరుపుతెచ్చుకున్న చిరుకోపంతో చూపింది. అంతలోనే సిగ్గు అల ముంచుకురావడంతో కుడి చేతిని చెక్కిలికి అడ్డుపెట్టుకుని అవనత వదనంతో అక్కడినుంచి తుర్రుమంది.

* * *

ఆరతి రాత్రి ఇంటికి చేరుకునేసరికి హఠాత్తుగా గుర్తుకువచ్చింది, ఆరోజు సాయంకాలం అక్క భారతి పెళ్ళిచూపులన్న విషయం. అందుకే తిన్నగా అక్క దగ్గరకు వెళ్ళింది.

"హాయ్ అక్కా! పండా, కాయా?" అంటూ మెడకు రెండుచేతులూ పెనవేసి అక్కను వాటేసుకుంది. "పెళ్ళికొడుకు ఎలా వున్నాడే? కోతా, కొండముచ్చా?"

మృదువుగా తన చేతుల్ని విడిపించుకుంటూన్న అక్క వదనంలోకి చూసిన ఆరతికి విషయం కొంతవరకు అవగాహన అయింది.

"ఏం పిక్నిక్ సరదాగా జరిగిందా అరూ!" అని అడిగింది భారతి నవ్వుతూ.

"ఆఁ. అక్కడి నుంచి కదిలిరాబుద్ధి వేయలేదనుకో" అంది ఆరతి. "మనుష్యుల కంటే జంతువులే నయమనిపించింది."

"హుఁ!"

"ఆఁ. అందుకే నువ్వూ వచ్చుంటే బావుండేదనుకున్నాను."

"సరేలే. నీకు నచ్చిందిగా, చాల్లే" అంది భారతి నవ్వుతూ.

"అసలు నాకు తెలియకడుగుతాను- అలా బయట ఎక్కడైనా తిరిగిరావడమంటే నీ కెందుకు నచ్చదు? అమ్మమ్మలా ఎప్పుడూ ఆఫీసు, ఇల్లూ తప్ప రెండో సరదాయే తలపెట్టవెందుకు? మనిద్దరిదీ ఒకే వయసుగదా! మన వయసులోని పిల్లలకు వుండే సరదాలకూ, సంతోషాలకూ నువ్వెప్పుడూ దూరంగా వుంటావెందుకు?" అంటూ విసుక్కుంది ఆరతి.

"అయిందా? చిన్న విషయానికి ఎంత పెద్ద వుపన్యాసం ఇచ్చావే తల్లీ!" అంటూ నవ్వింది భారతి.

"నువ్విలా అన్నిటిలోనూ అమ్మమ్మ లక్షణాలు అలవరచుకోబట్టే ఏం పెళ్ళికొడుక్కి నచ్చడంలేదు నువ్వు" అనేసి,

అంతలోనే తన పొరపాటు గ్రహించడంతో చటుక్కున నాలుక కరచుకుంది ఆరతి.

చెల్లెలి చివరిమాటకు భారతి వదనం చిన్నబోయింది.

"సారీ అక్కా! పొరపాటున నోరు జారాను" అంటూ చుబుకం పట్టుకుని బ్రతిమలాడుతున్న చెల్లెలివదనం చూసేసరికి నవ్వొచ్చింది భారతికి.

"పిచ్చిదానా! ఇప్పుడు నువ్వు కాని మాట ఏమన్నావనే, అలా బాధపడతావ్" అంటూ ఓదార్చింది.

"లేదక్కా, ఇంత చిన్నవయసులోనే అన్ని సరదాలు చంపుకుని నువ్విలా గూట్లో చిలుకలా పడివుండడం నాకు నచ్చక అలా అన్నానేగాని, నిన్ను కించపరచాలని కాదు" అంటూన్న ఆరతి కన్నుల్లో నీళ్ళు చిప్పిల్లాయి. "నిన్ను కాదన్నవారే దురదృష్టవంతులు. కేవలం ఐశ్వర్యంకోసం ఈ అందాలరాశిని, అనురాగమయిని వదులుకుంటూన్న వారి అవివేకానికి ప్రతిసారీ వాళ్ళపైన జాలి కలుగుతూ వుంటుంది నాకు. ఐ రియల్లీ పిటీ దెమ్."

"ఛీ పిచ్చిపిల్లా! చిన్న విషయానికి మరీ అంతగా ఇదవుతావెందుకే!" అంటూ చెల్లెల్ని బాహువుల్లోకి తీసుకుంది భారతి.

"చూస్తూవుండు-త్వరలోనే ఏ రాజకుమారుడో వచ్చి ఈ దేవతను కన్నుల కద్దుకొని ఎగరేసుకు పోకపోతేను" అంటూన్న చెల్లెల్ని,

"యూ నాటీ!" అంటూ చెక్కిలిమీద చిన్నగా దెబ్బవేసింది నవ్వుతూ-లోపల మాత్రం 'ఈ అక్క కంత అదృష్టమే వుంటే వచ్చిన ప్రతి సంబంధమూ ఎందుకు తప్పిపోతుందే పిచ్చిదానా!' అనుకుంది బాధగా.

అంతలో తల్లి పిలుపు వినిపించడంతో అక్కడి నుంచి కదిలి వెళ్ళారు ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని.

## 2

సుబ్బాయమ్మగారికి భర్త పోయి పదేళ్ళయింది. సివిల్ ఇంజనీర్‌గా పనిచేసినా అతను సంపాదించిందంటూ ఏమీలేదు. ఒకరోజున ప్రాజెక్ట్ ఏరియాలో పనులు చేయిస్తూ ప్రమాదానికి గురై చనిపోయాడతను. అప్పటికి భారతి, ఆరతి పదేళ్ళ పిల్లలు. స్కూల్లో చదువుకుంటున్నారు.

ఆ పదేళ్ళలోనూ ఆ ఆడపిల్లలిద్దర్నీ ఎన్ని కష్టాలుపడి పెంచిందో సుబ్బాయమ్మగారికే ఎరుక. గ్రుడ్డిలో మెల్లలా పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిగా పాత డాబాఇల్లు ఒకటి వుండడంతో తల దాచుకునేందుకు గూటికొరత లేకపోయింది.

భారతి, ఆరతి కవలపిల్లలు. ఇద్దరికీ కొన్ని నిమిషాలే తేడా. అందగత్తెలైన ఆ అక్క-చెల్లెళ్ళను ఎవరు ఎవరో పోల్చుకోవడానికి కష్టపడుతూ వుంటారంతా. అయితే పెద్దపిల్ల భారతి సాధారణ అలం

కరణంతో ఎప్పుడూ చీరెలే కడుతూ వుంటుంది. మనిషి అతి నెమ్మది. చిన్నపిల్ల ఆరతి అందుకు భిన్నంగా ఫాషన్లంటే మోజుపడుతూ వుంటుంది. ఎక్కువగా చుడీదార్, కుర్తాలను ధరిస్తూ వుంటుంది. గలగలా మాట్లాడుతూ చలాకీగా వుంటుంది.

భారతి సాఫీగా సాగే సెలయేరయితే, ఆరతి వురుకులు పరుగులతో గలగల పారే జలపాతం లాంటిది.

అక్కచెల్లెళ్ళకు ఒకరిపై వొకరికి అమితమైన ప్రేమానురాగాలు, మమతానుబంధాలూను. ముచ్చటగొలిపే కూతుళ్ళిద్దరినీ రెండుకళ్ళలా చూసుకుంటూ, వారిని చూసుకునే ఎన్ని కష్టాలైనా భరిస్తూ వచ్చింది సుబ్బాయమ్మగారు. శ్రద్ధగా చదువుకుని డిగ్రీలు తీసుకున్న అమ్మాయిలకు వుద్యోగాలు కూడా వెంటనే రావడంతో ఆ తల్లి హృదయం అన్నేళ్లూ తాను పడిన కష్టాలను మరిచిపోయి సంతోష తరంగాలలో మునకలు వేసింది. ఆ సమయంలో భర్త పోయినందుకు నిశ్శబ్దంగా ఏడ్చింది కూడాను.

భారతి, ఆరతిలకు ఒకే బ్యాంకులో వుద్యోగం లభించడం కూడా ఓ విశేషమే. అష్టకష్టాలూ పడి తల్లీ, తండ్రీ తానే అయి తమను పెంచిన తల్లిని సుఖపెట్టాలన్న ధ్యేయం పిల్లలదైతే వాళ్ళను త్వరలోనే ఒకింటివాళ్ళనుచేసి ఆ బాధ్యత కూడా నెరవేర్చుకోవాలన్న ధ్యేయం, తహతహ తల్లిది. అందుకే సంబంధాల కోసం చూస్తోంది ఆమె. మొదట భారతికి కుదిరినట్లయితే తర్వాత ఆరతికి చూడవచ్చు ననుకుంది. కాని, కూతుళ్ళకు ఎంత అందచందాలు, గుణగణాలూ, వున్నా, చక్కని వుద్యోగం వున్నా కట్నాల వద్దకు వచ్చేసరికి వచ్చిన సంబంధాలన్నీ చెడిపోతున్నాయి. వరుల ఆశల పారామీటర్ చూపుల కందనంతగా చుక్కల్లో కలిసిపోవడంతో అంతవరకువచ్చిన ఆరేడు సంబంధాలూ తప్పిపోయాయి. దాంతో తల్లితోపాటు భారతిక్కూడా మనసులో బాధ కలిగింది. కూతురు ఇష్టంలేదంటున్నా ఆ సంబంధమైనా కుదరకపోతుందా అన్న ఆశతో ఆమె ఎప్పటికప్పుడే పెళ్ళి చూపులు ఏర్పాటుచేయడం, దేనికదే తప్పిపోవడమూ జరిగేసరికి భారతికి పెళ్ళంటేనే వెగటు పుట్టడం ప్రారంభించింది. తాను ఎవరికీ నచ్చరాదన్న భావన ఏదో మూల నాటుకుపోయింది ఆ పిల్ల మదిలో. తనకోసం ఇక ప్రయత్నాలు చేయవద్దనీ చెల్లెలికి ప్రయత్నించమనీ తల్లితో చెప్పేసింది కూడాను.

"ఇద్దరూ సమాన అందగత్తెలే కదే తల్లీ! సంబంధాలు కుదరకపోవడానికి కారణం- వారి ఆశల నిచ్చెనను ఎక్కలేని మన అశక్తతేగాని, నీ అందచందాల కొరతేం కాదుగదా! అనవసరంగా పిచ్చిపిచ్చి ఆలోచనలతో మనసు

పాడుచేసుకోకమ్మా!" అంటూ కూతుర్ని ఓదార్చేది సుబ్బాయమ్మగారు.

## 3

ఆరోజు తన ఫేవరైట్ హీరో నటించిన కొత్త చిత్రం విడుదలవుతున్నట్లు తెలియడంతో, మధ్యాహ్నం నుంచి ఆఫీసు ఎగ్గొట్టి ఓ స్నేహితురాలితో మ్యాట్నీ షోకి వెళ్ళింది ఆరతి.

బుకింగ్ దగ్గర క్యూలో నిల్చొని వాల్ పోస్టర్లు చూస్తున్న ఆరతి 'హలో' అన్న పిలుపు వినిపించడంతో అటువైపు తిరిగింది.

మరుక్షణం ఆమె కళ్ళలో మెరుపు మెరిసింది... జూలాజికల్ పార్క్‌లో కనిపించిన యువకుడు!

"మిస్! ఇఫ్ యూ డోంట్ మైండ్, నాకో టికెట్ తీసిపెడతారా?" చిరునవ్వుతో అడిగాడతను.

అప్రయత్నంగా చేయి చాచిందామె.

హాల్లో ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు ఇద్దరూ. అతనిపక్కన కూర్చోవడం ఎలాగో వున్నదామెకు. ఓ పక్క సిగ్గూ మరోపక్క ఏదో వింత అనుభూతీను.

"ఏమండీ!" అన్నాడతను మెల్లగా.

ఏమిటన్నట్లు చూసింది ఆరతి.

"ఈమధ్య మీలాంటి అమ్మాయినే జూలాజికల్ పార్క్‌లో చూశాను" అన్నాడు.

"అలాగా! నాకైతే బయట ఎవరిని చూసినా జూలో చూసిన ఏదో ఒక జంతువు జ్ఞాపకంవస్తూనే వుంటుంది" అంది కొంటెగా.

ఆరతి జవాబు విని కిసుక్కున నవ్వింది ఆమె స్నేహితురాలు.

ఆపైన నోరెత్తలేదతను. ఏదో చూస్తూ ఉండిపోయాడు.

అతన్ని అనవసరంగా హర్ట్ చేసానేమో అనుకుని లోలోపలే విలవిల్లాడింది ఆరతి.

"ఏమండీ!" అంది మెల్లగా.

"ఏమ్మా?" అన్నాడతను ఆమెవైపు తలతిప్పి.

"ఊఁ మీకు... జూ అంటే ఇష్టమా" అని అడిగింది.

"ఔను- ఎందుకో తెలుసా? ఒక్కోసారి ఆలింగనం చేసుకునే అప్సరసలు అక్కడ తారసపడవచ్చును కనుక!" అంటూ ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు.

సిగ్గుతో ఆమె తల వాలిపోయింది.

గులాబిలైన చెక్కిళ్ళూ, అరుణిమ దాల్చిన వదనమూ చూసి ముగ్ధుడయ్యాడతను.

సినిమా ఆరంభం కావడంతో చూడడంలో మునిగిపోయారు.

మధ్య మధ్య ఇద్దరి చేతులూ మధ్య వున్న హ్యాండ్‌రెస్ట్‌మీద కలుసుకోవడం, ఒకరికొకరు చిన్నగా 'సారీ' చెప్పుకోవడమూ సినిమా పొడుగుతా సాగుతూనే వుంది.

సినిమా ముగిశాక వెళుతూ వెళుతూ ఆరాధనగా ఆమె వదనంలోకి చూశాడు అతను. "నా పేరు రాహుల్. ఇఫ్ యూ డోంట్ మైండ్ మీ పేరు తెలుసుకో వచ్చునా" అన్నాడు.

ఆరతి నవ్వి "అనామిక" అంది.

"చక్కని పేరు" అని మెచ్చుకున్నాడు.

నవ్వుకుంది ఆరతి.

"యూ నాటీ! ఆటలు పట్టించడానికి నీకు కొత్తా పాతా లేదనుకుంటాను" అంటూ నవ్వింది స్నేహితురాలు అతను వెళ్ళగానే.

## 4

ఆరోజు ఎందుచేతో భారతి బ్యాంక్ కి వెళ్ళలేదు. సాయంత్రం బ్యాంక్ మూసి వేయగానే కాసేపు బీచ్ కి వెళ్ళి కూర్చుని ఇంటికి వెళ్ళొచ్చుననుకుంది ఆరతి. స్నేహితురాళ్ళను అడిగితే పనులున్నాయని వెళ్ళిపోయారు. బీచ్ కి ఒక్కతే వెళ్ళింది.

జనసమ్మర్దానికి కొంత దూరంలో - సముద్రంపై ఎగిరే పక్షులను, వాటిని అందుకోవడానికా అన్నట్లు ఎగిసిపడే అలలనూ, అలలపైన అలవోకగా తేలియాడుతూన్న చిన్న చిన్న పడవలనూ చూస్తూ చల్లగాలికి హాయి గొలుపుతుంటే ఇసుకలో కూర్చుని వుండిపోయింది ఆరతి వొంటరిగా.

ఉన్నట్లుండి "హలో అనామికగారూ" అన్న పిలుపు వినిపించడంతో యథాలాపంగా అటువైపు చూసిన ఆరతి చిన్నగా వులిక్కిపడింది, అక్కడ ప్రత్యక్షమైన రాహుల్ ని చూస్తూనే.

'అనామిక' పేరుతో అతను పలకరించింది తననేనని గ్రహించేసరికి నవ్వొచ్చింది.

"సారీ! మీ ఏకాంతానికి భంగం కలిగించాననుకుంటాను" అంటూ దగ్గరగా వచ్చాడతను.


"లేదు, కూర్చోండి" అంది సభ్యత కోసం.

ఆ సమయంలో అనుకోకుండా అతన్ని అక్కడ చూసినందుకు తత్తరపాటుగానూ, ఆనందంగానూ కూడా వుంది ఆరతికి.

జూలో మొదటిసారిగా చూసినప్పటి అతని రూపం ఆమె మదినుంచి చెరిగిపోకముందే సినిమాహాల్లో కలుసుకోవడం జరిగింది. చూపులు పలుకులవరకు వెళ్ళాయి. అప్పటినుంచీ అతను క్షణక్షణమూ గుర్తుకొస్తూనే వున్నాడు. నిజానికి సముద్రునిలోని గాంభీర్యతను చూస్తుంటే అతను తలపులలో ప్రవేశించాడు. అంతలోనే ఇలా పిలిచినట్లు ప్రత్యక్షం కావడం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించాయి.

ఆమె పక్కనే చతికిల పడ్డాడతను ఇసుకలో.

"జూలో చూసిన జంతువు ఎక్కడ



పడితే అక్కడ కనిపిస్తోందేమిటా అనుకుంటున్నారా?" అన్నాడు మందహాసంతో.

"అమ్మాయిల వెంటపడే అబ్బాయిలను జంతువులతో పోల్చడం అన్యాయమండీ- వింటే అవమానంతో ఆత్మహత్య చేసుకోలను అని!"గ అంది అరతి నవ్వాపుకుంటూ.

తెల్లమొగం వేశాడతను. కిలకిలా నవ్విందామె.

"ఆడపిల్లలు అబ్బాయిల కంటె వయసులో చిన్నవాళ్ళయినా తెలివితేటలలో వాళ్ళదే పైచెయ్యి. మాటల్లో అబ్బాయిలను ఇట్టే చిత్తుచేసేస్తారు అని ఎప్పుడో చదివాను. అది నిజమని మీరిప్పుడు రుజువుచేస్తున్నారు" అన్నాడతను నవ్వుతూ.

అతను అరమరికలులేకుండా చనువుగా మాట్లాడుతుంటే తానూ అతనితో ఫ్రీగా మాట్లాడింది అరతి. సహజమైన తన చిలిపితనంతో చలాకీతనంతో అతన్ని పూర్తిగా ఆకట్టుకుంది. ప్రథమ వీక్షణంలోనే ఆమె సౌందర్యానికి ఆకర్షితుడయిన రాహుల్, ఇప్పుడామె స్వభావాన్ని కూడా తెలుసుకోవడంతో ముగ్ధుడయ్యాడు.

"అనామికగారూ! ఈ లోకంలోని సౌందర్యమంతా మీరే పుణికిపుచ్చుకున్నట్లుగా అనిపిస్తోంది నాకు. మీ సుందర వదనాన్ని చూస్తూ ఎటువంటి కష్టాలనైనా ఇట్టే మరిచిపోవచ్చు. మీ స్నేహం లభించినందుకు నేను ధన్యుణ్ణి" అన్నాడతను.

కిసుక్కున నవ్విందామె. "కొంపదీసి మీరు కీల్బాక్ నుంచి తిన్నగా ఇక్కడికి రాలేదుగదా?" అంది.

అతను తెల్లబోయి "ఎందుకలా అడిగారు" అన్నాడు.

"తమరు పిచివాళ్ళంటారు. మీ రిప్పుడేదో కవిత్వం అల్లితేను- మీరు పిచ్చివారేమోనని అడిగాను" అంది పెదాల బిగువున నవ్వాపుకుంటూ.

అతనూ నవ్వేసాడు "మీరు చాలా చిలిపివారు!" అంటూ

"మిస్ అనామికా! మీరు అడక్కపోయినా నా గురించి చెప్పుకోవాలని పిస్తోంది. మీకేమైనా అభ్యంతరమా?" అని అడిగాడు.

"వాక్స్వాతంత్ర్యం అందరికీ ఉంది మధ్య నా అభ్యంతరం దేనికి?" అంది చిరునవ్వుతో.

"నాకు నా అన్నవాళ్ళెవ్వరూ లేరు. చిన్నప్పటినుంచీ కష్టపడి పెరిగాను. వారాలతో చదువుకున్నాను. ప్రస్తుతం ఓ ప్రముఖ మందులకంపెనీలో మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా పనిచేస్తున్నాను. నెలకు రెండువేలు జీతం వస్తోంది... మీ వంటి అందమైన అమ్మాయిని ప్రేమించి పెళ్ళాడదన్న ఆశ!"

నవ్వేసిందామె.

"నా వివరాలు చెప్పాను. అభ్యంతరం లేకపోతే మీ వివరాలు కూడా వినాలని కుతూహలంగా వుంది" అని అతనడంతో — మొదట తటపటాయించినా, తాను ఎక్కడ పనిచేస్తున్నదీ చెప్పింది ఆరతి. అసలు పేరు మాత్రం చెప్పలేదు. ఆ స్వల్ప పరిచయంలోనే కుటుంబపు వివరాలు చెప్పడం ఇష్టంలేక ఊరుకుంది. అయినా ఆ మాత్రానికే ఎంతో ఆనందమైంది అతనికి.

"మీ రెక్కడ పనిచేస్తున్నారో తెలిసింది కనుక ఇక మీ సుందరవదనారవింద సందర్శనా భాగ్యం రోజూ లభించుకోవచ్చును" అన్నాడు.

"అలా రోజూ వచ్చారంటే అల్లరి పడిపోగలరు జాగ్రత్త!" అందామె నవ్వుతూ.

"రేపే నా అకౌంట్‌ని మీ బ్యాంక్‌కి మార్చేస్తాను. ఆ వంకనైనా తరచు మిమ్మల్ని చూసే అదృష్టం కలుగుతుంది" అన్నాడు.

అతని పలుకులు ఆమె కన్నెహృదయాన్ని పన్నీటిజలకాలు ఆడించడంతో సిగ్గుగా తల వంచుకుంది.

ఆమె ముగ్ధ మంజులరూపాన్ని ఆరాధనగా చూస్తూ వుండిపోయాడు అతను.

## 5

ఆ మధ్య రెగ్యులర్ క్యాషియర్ సెలవుపెట్టడంతో అతని స్థానంలో ఆరతి నియమించబడింది తాత్కాలికంగా.

ఆరోజు క్యాష్ ట్రాన్సాక్షన్స్‌తో బిజీగా వున్న ఆరతి "హాయ్! అనామికా!" అన్న పలకరింపుతో తలెత్తి చూసింది.

ఆ యువకుడెవరో తననే చూస్తున్నాడు! మరో స్త్రీ ఎవరూ లేరక్కడ.

"పిలిస్తే పలకరేం?" అన్నాడతను మళ్ళీ-

"నాపేరు అనామిక కాదు" అందామె ముక్తసరిగా.

"రియల్లీ" అన్నాడతను తమాషాగా.

"ఈమధ్య మీరు కన్పించడమేలేదు" విస్ఫారంగా అంటూన్న ఆ యువకుని వంక ఆశ్చర్యంగా చూసిందామె. నొసలు చిట్లించి,

"టోకెన్ ప్లీజ్!" అంది.

"సారీ!" అంటూ తన క్యాష్‌టోకెన్ అందించాడు. నలుగురిలో పలకరించినందుకు ఆమెకు కోపం వచ్చిందనుకున్నాడు.

మర్నాటి సాయంత్రం పార్కులో కలుసుకున్న ఆరతికి క్షమాపణలు చెప్పుకున్నాడు రాహుల్, "సారీ అనామికా! నిన్న నిన్ను బ్యాంక్‌లో పలకరించి నీకు ఇబ్బంది కలిగించాననుకుంటాను" అంటూ.

"నిన్న బ్యాంక్‌లో పలకరించావా నన్ను?" అని అడిగింది.

"అదేమిటలా తెల్లబోయి చూస్తున్నావే?". అన్నాడు "డోంట్ ఫూల్ మీ గర్ల్! నిన్న ఉదయం క్యాష్‌కౌంటర్‌లో పలకరిస్తే మూతివిరిగించి నొసలు చిట్లించి కోజా కొట్టలేదూ నువ్వు?"

ఏదో అర్థమైనదానిలా పకపక నవ్వింది ఆరతి.

నెల్లాళ్ళుగా ఆరతీ రాహుల్ తరచు బీచ్‌లోనో, పార్కులోనో కలుసుకుంటూనే వున్నారు. వారి పరిచయం చనువుగా మారి ఏకవచన ప్రయోగం వరకు వచ్చింది. ఆ తర్వాత ప్రేమపూతను తొడుగుకుని కూడా చాలా రోజులయింది అంత చేరువయినా తన అసలు పేరుగాని తన కుటుంబ విషయాలుగాని అతనికి చెప్పనేలేదు ఆమె.

అందుకే జరిగిందేమిటో ఇట్టే గ్రహించగలిగింది ఆరతి క్యాష్ కౌంటర్‌లో అక్కను చూసి అతను తాననుకుని పలకరించివుంటాడనీ, రిజర్వ్‌డ్ స్వభావంగల భారతి అతనితో ముభావంగా ప్రవర్తించి ఉంటుందనీ అర్థంచేసుకుంది

అప్పటికైనా అసలువిషయం చెప్పకపోతే వాళ్ళిద్దరూ ముందుముందు ఇంకేం ఇబ్బందులను ఎదుర్కోవలసివస్తుందోననిపించి ఆరోజు తన పూర్తి వివరాలను అతనితో చెప్పేసింది ఆమె.

భారతి, ఆరతి కవలపిల్లలంటే అందునా ఒకే బ్యాంక్‌లో ఇద్దరూ పనిచేస్తున్నారంటే ఓ పట్టాన నమ్మలేకపోయాడు రాహుల్. ఆమె తనను ఆటలు పట్టిస్తుందేమోనన్న అనుమానం కలిగింది. కాని, ఆమె నిజమే చెబుతున్నట్లు తెలియగానే విస్తుపోయాడు. తన అసలుపేరు కూడా చెప్పేసింది.

ఆమె తనను ఎలా ఫూల్ చేసిందో గ్రహించేసరికి పెద్దగా నవ్వేసాడు అతను- "ఏదేవే నువ్వు నాకు అనామికగానే పరిచయమయ్యావు. కనుక ఆపేరుతోనే పిలుస్తాను నేను" అన్నాడు.

అరతి, రాహుల్‌ల ప్రేమ దినదినాభి వృద్ధిపొందుతున్నా ఇంట్లో తెలియకుండా జాగ్రత్తపడింది అరతి. సమయం వస్తే కాని చెప్పకూడదనుకుంది.

అంతలో రాహుల్ అనుకోకుండా తన మకాం అరతి ఇంటి ప్రక్కనున్న డాబాలోకి మార్చడం జరిగింది. దాంతో మరింత చేరువగా వచ్చారిద్దరూ.

ఒకరోజున ఏదో పనిలో అతన్ని యింటికి తీసుకొచ్చి తల్లికి, అక్కకు పరిచయం చేసింది. అప్పటినుంచీ అప్పుడప్పుడూ వచ్చిపోతూండేవాడతను

ఆరునెలలు గడిచేసరికి ఆ కుటుంబా నికి సన్నిహితుడయ్యాడనే చెప్పాలి అతను. అవసరమైనప్పుడల్లా సుబ్బా యమ్మగారికి బయటపనుల్లో సహకరిస్తూ మగదిక్కులేని ఆ కుటుంబానికి మగ తోడు అయ్యాడు. అవిడను 'ఆంటీ' అని పిలుస్తూ చనువుగా తిరగసాగాడు.

అక్కచెల్లెళ్ళను పోల్చుకోవడం కష్టంగానే వుంది రాహుల్‌కి. ఇద్దరూ కలిసివున్నప్పుడు తప్ప వేరువేరుగా కని పించినపుడు పొరబడుతూనే వున్నాడు. డాబాపైన నిలుచుని తల ఆర్చుకుంటు న్నప్పుడో మరేదైనా చేస్తున్నప్పుడో అరతి అనుకుని భారతికి సైగలు చేయ డమో గాలిలో ముద్దులు కురిపించడమో ఏదో ఒక చిలిపిచేష్టను చేస్తూనే వున్నా డతను.


మొదట్లో తెల్లబోయినా అతని చిలిపి పనులకు సిగ్గుతో వొళ్ళు పులకించేది భారతికి. క్రమంగా అతనిపైన ఇష్టం ఏర్పరచుకోసాగింది. అది కాస్తా తెలియ కుండానే ప్రేమగా మారింది. దానికితోడు సుబ్బాయమ్మగారికి కూడా రాహుల్‌ని భారతికి అడగాలన్న ఆలోచన వుండేది. ఒకటిరెండుసార్లు కూతుర్ని ఆ విషయం కదిపితే సిగ్గుతో అక్కటినుంచి పారిపో యింది భారతి. అతనంటే ఆమెకూ ఇష్ట మేనని గ్రహించి సంతోషించింది అవిడ. రాహుల్‌తో పెళ్ళివిషయం కది పేందుకు సమయంకోసం ఎదురు చూస్తోంది.

## 6

ఆరోజు బ్యాంక్‌కి వెళ్ళు...అరతి తలంటుపోసుకుంది. చుడీదార్, కుర్తా లకు అలవాటుపడిన ఆమెకు ఎందుకో ఆ రోజు చీరె కట్టుకోవాలనిపించింది. తన కొత్త గార్డెన్‌వాయిల్ చీరని కట్టుకో మని ఇచ్చింది భారతి. తాను చీరె కట్టు కోవడమే కాక, బలవంతంచేసి అక్క చేత తన చురీదార్ కుర్తాలను తొడిగిం చింది అరతి.

ఆ సాయంత్రం ఎవరో స్నేహితు రాలింటికి వెళ్ళింది అరతి. సుబ్బాయమ్మ గారు పక్కింటావిడతో గుడికి వెళ్ళింది. భారతి ఒక్కతే ఇంట్లో వుంది.

ఎవరో తలుపు తట్టడంతో తల్లో చెల్లో తిరిగి వచ్చుంటారనుకుని వెళ్ళి తలుపు తెరిచింది భారతి.



గుమ్మంలో రాహుల్ నిలుచున్నాడు

అతన్ని చూడగానే అప్రయత్నంగా సిగ్గు ముంచుకొచ్చింది ఆమెకు.

"ఈ భక్తుణ్ణి ఇలా బయటే నిలబెట్టేయడం దేవిగారికి న్యాయం కాదు" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

ఆమె బుగ్గలు మరింత కెంపులయ్యాయి

"సారీ లోపలకు రండి" అంది. మెల్లగా.

లోపలికి వస్తూనే తలుపులు మూసేసాడు అతను. తెల్లబోయి చూస్తున్న ఆమెతో "ఈ డ్రెస్‌లో నువ్వెంత బావున్నావో తెలుసా డియర్?" అంటూ చటుక్కున ఆమెను కౌగిలించుకున్నాడు.

ఉలిక్కిపడిన భారతి తత్తరపాటుతో "అమ్మవస్తుంది" అంది ఏమనాలో తెలీక

"నాకు తెలుసులే ఇంట్లో నువ్వొక్కతెవే వున్నావని" అంటూ ఆమె చెక్కిళ్ళ పైన సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆమె కన్నెహృదయం పులకించింది తనువు లతలా కంపించింది. తన్మయత్వంతో అతని బిగికౌగిలిలో అలా ఎంత సేపు వుండిపోయిందో తెలియదు. హఠాత్తుగా వివేకం వెన్నుతట్టడంతో త్రుళ్ళిపడి మృదువుగా అతనికౌగిలి విడిపించుకుని దూరంగా జరిగింది.

"అమ్మ వచ్చే టైమైంది. వెళ్ళిపోండి. ప్లీజ్!" అంటూ గిరుక్కున తిరిగి లోపలికి పరుగెత్తింది ఆమె.

ఆమెలో వచ్చిన మార్పుకు తెల్లబోయిన రాహుల్ "అనామికా! ప్లీజ్... ఆగు" అంటూ పిలిచినా లాభంలేకపోయింది. చిన్నగా నిట్టూర్చి బయటకు వెళ్ళిపోయాడు.

## 7

ఆరాత్రి అక్కకోసం ఎదురుచూస్తూ పక్కమీద దొర్లుతూంటే ఆరోజు సాయంత్రం బీచ్‌లో ఒకరి కౌగిట్లో ఒకరు ఇమిడివున్న వేళ రాహుల్ అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి ఆరతికి.

"అనామికా! త్వరలోనే నాకు ఢిల్లీ బదిలీ అయేట్టుంది. ఈలోపున మన పెళ్ళి అయిపోతే ఏకంగా మనం కలిసి ఢిల్లీ వెళ్ళిపోవచ్చును. ఏమంటావ్?" అన్నాడు ఆమె చెక్కిళ్ళు నిమురుతూ.

"నీ ఇష్టం" అంది తన ముఖంమీద పడుతున్న అతని జుట్టుతో ఆడుకుంటూ.

"అయితే ఇవాళే అంటీని అడుగుతాను" అన్నాడు ఉత్సాహంగా.

"ఆగాగు! లేడికి లేచిందే పరుగన్నట్టు ఏమిటా తొందర? ముందు మా వాళ్ళ ఆలోచన ఎలా వున్నదో నన్ను తెలుసుకోనియ్. ఆ తరువాత అమ్మను అడగొచ్చు" అంది.

ఆరాత్రి అక్కతో తమ ప్రేమ గాథ అమ్మకు చెప్పించాలనుకుంది ఆరతి.

కాసేపటికి భారతి వచ్చింది. ఆ విషయం ఎలా కదపాలా అని ఆలోచిస్తోంది ఆరతి.

భారతి జడ విప్పుకుని జుట్టువిరబోసుకుంది. తర్వాత చెల్లెలి ప్రక్కలో కూర్చుని "ఆరూ!" అంది. "నీ సలహా కావాలే" అంది చిరునవ్వుతో.

"ఏ విషయంలో?" అడిగింది ఆరతి కుతూహలంగా.

ఓ క్షణం నిశ్శబ్దంగా వుండిపోయింది భారతి.

"ఆరూ! ప్రేమిస్తే ఏమవుతుందే?"

ఎదురుచూడని ఆ ప్రశ్నకు చిన్నగా ఉలిక్కిపడి అక్కముఖంలోకి చూసింది ఆరతి. కొంపదీసి నా ప్రేమ సంగతి ఇంట్లో తెలిసిపోలేదు గదా అని భయపడింది.

"ప్రేమిస్తే—పెళ్ళవుతోంది!" అని జవాబిచ్చింది.

"ప్రేమికులందరికి ఆ అదృష్టం కలుగుతుందంటావా?"

"ప్రేమ నిజమైనదైతే తప్పక ఫలిస్తుంది." అంది ఆరతి.

చెల్లెలివంక చూసి అందంగా నవ్వింది భారతి. ఆమె వదనంలో కళ కళ్ళలో మత్తు చూసి, కొంపదీసి అక్క కూడా ఎవరి ప్రేమలోనో పడలేదుగదా!" అనుకుంది ఆరతి.

'అక్కయ్య ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు. ఏదో విశేషం వుంది' అనుకుంటూ

"నా దగ్గర సంశయమెందుకే అక్కా! నీ మనసులో మాటేమిటో చెప్పకూడదూ?" అంది అక్కచేతిని తనచేతిలోకి తీసుకుని.

చెల్లెలు అడగడంతో సిగ్గు ముంచుకు రాగా చెల్లెలి భుజంమీద ముఖం దాచుకుంది భారతి.

"అరూ! రాహుల్ గురించి నీ అభిప్రాయమేమిటే?" అన్న భారతి ప్రశ్నకు వులిక్కిపడిన అరతి "మంచివాడేమ-అయినా ఇప్పుడు అతని విషయం ఎందుకు?" అంది.

"అమ్మ అతన్ని అల్లుణ్ణి చేసుకోవాలనుకుంటోందే!"

ఊపిరి బిగవట్టింది అరతి.

"అరూ! రాహుల్ నాకూ నచ్చాడే."

మిన్ను విరిగి మీదపడింది అరతికి.

"అక్కా!" అంటూ అరిచింది అప్రయత్నంగానే.

భారతి త్రుళ్ళిపడి చెల్లెలి భుజంమీంచి లేచింది.

"ఏమిటే అరూ! ఎందుకలా అరిచావ్" అని అడిగింది కంగారుపడుతూ.

వర్దుకుంది అరతి. "అబ్బే ఏం లేదక్కా! ఎందుకో నాకు తెలీకుండానే గట్టిగా వచ్చేసింది పిలుపు" అంది లేచి కూర్చుంటూ.

"ఎందుకో చెప్పమంటావా?" అంది భారతి చిరునవ్వుతో. "ఈ అక్కకు రాహుల్‌వంటి రాజకుమారుడు లభిస్తున్నాడన్న ఆనందంతో. కానా?"

అరతి ముఖం పాలిపోయింది.

ఆమెవంక చూడగానే లేత తమల పాకుల వంటి తన చేతులవంక చూసుకుంటూ చెప్పుకుపోయింది భారతి-"అరూ! నాలో నిద్రాణమైవున్న కోర్కెలను, ప్రేమానురాగాలనూ లేపి, రెచ్చగొట్టింది రాహుల్. అతని చూపులు, చేష్టలు నా తనువుకు చందన సుగంధాలను లేపనం చేస్తూంటే అతని మనోహరరూపాన్ని నా హృదయఫలకంమీద ముద్రించుకున్నాను...నా మనసు ఎరిగి వల్లు అమ్మకూ అదే ఆలోచన కలగడం నా అదృష్టం..."

అక్క పలికే ఒక్కొక్క పలుకూ తన హృదయంమీద సమ్మెట పోటుల్లా తగులుతుంటే పెదవు పెదవులు మొద్దుబారిపోయి, వెర్రిగా చూస్తూ వుండిపోయింది అరతి.

"మాట్లాడవేమే మొద్దూ!" అన్నదేగాని తలెత్తి చెల్లెలి వదనంలోకి చూడనే లేదు భారతి, లజ్జా కారణంగా.

"అతను...అతను నిన్ను ప్రేమిస్తున్నాడా అక్కా?" అంది అరతి. ఎలాగో గొంతు పెగల్చుకొని. మాట నూతిలోంచి వచ్చినట్లుంది.

"అతనికీ నేనంటే ఇష్టమేనని పిస్తోంది" అంది, రెండురోజుల క్రితపు సంఘటనను తలచుకుంటూ. ఆ తలపులతో ఆమె చెక్కిళ్ళు మరింత అరుణిమను దాల్చుకున్నాయి.

అక్క వదనం చూసి ఆమె మనసేమిటో తెలిసి విశ్చేష్టురాలయింది ఆరతి.

"అక్కా!" మళ్ళీ చెప్పుకుపోయింది భారతి.

"ఎందరి ముందో పెళ్ళిచూపులకు కూర్చుని కట్నం చాలలేదన్న కారణంగా ప్రతి సంబంధమూ తిరిగిపోతూంటే నిరాశా, నిస్పృహా అలముకునేవి నాలో. అమ్మ తపనను అశక్తతను చూస్తే బ్రతుకుమీద రోత పుట్టి జీవితమే అంతం చేసుకోవాలన్న ఆలోచన కూడా కలిగేది అప్పుడప్పుడు...అలాంటి నిరాశామయ సమయంలోనే రాహుల్ మన జీవితాలలో ప్రవేశించాడు. తన చూపులతో, చేష్టలతో నా మనసు దోచుకున్నాడు. అతని కన్నులలోని ఆరాధన చూస్తే జీవితంపైన మళ్ళీ ఆశ చిగురించింది నాకు కాని నా మనసు విప్పి ఎవరికీ చెప్పుకునే ధైర్యంలేక నా ప్రేమను నాలోనే దాచుకున్నాను ఇన్నాళ్ళూ. అయితే అదృష్టవశాత్తూ అమ్మకూ అదే ఆలోచన కలగడంతో నా కలలు పండే సమయమాసన్నమైందనిపిస్తోంది..."

ఆరతి గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యాయి. బుర్రలో మహా సముద్రాల ఘోష...ప్రకృతి హోరున విలపిస్తున్న శబ్దం...ఉబికివస్తోన్న కన్నీటిని ఆపుకునేందుకు ప్రయత్నం చేస్తోంది.

లేచి నిల్చోబోయింది ఆరతి. నిస్సత్తువగా తూలిపోయింది. కుర్చీ పట్టుకుని ఆపుకుంది.

హఠాత్తుగా చెల్లెలి వంక చూసిన భారతి ఉలిక్కిపడింది. "అరూ! ఏమయిందే?" అంటూ కంగారుగా దగ్గరకు వెళ్ళి పట్టుకుంది.

"ఏం లేదక్కా! ఎందుకో కొద్దిగా కళ్ళు తిరిగాయంతే" అంది అక్క చేతుల్ని మెల్లగా విడిపించుకుంటూ.

అక్క పలుకులు ఆ పిల్ల బుర్రలో హోరుమంటున్నాయి. ఆలోచనల అలలు ఉత్తుంగంగా ఎగిసిపడుతున్నాయి.

"అక్కా! నెమ్మదస్తురాలు. సున్నిత మనస్కురాలునయిన అక్క...వచ్చిన సంబంధమల్లా తప్పిపోతూంటే నిరాశను పెంపొందించుకొని జీవితంపైన విరక్తిని పెంచుకుంది. అలాంటి తరుణంలో రాహుల్ రాక...తాము కవలలు కావడంతో ఆరతి అనుకుని భారతితో చనువుగా, ప్రేమగా ప్రవర్తించివుంటాడు అసలు విషయం ఎరుగని అమాయకురాలు అతనిమీద ఆరాధన పెంచుకుంది. జీవితంపైన ఆశల చిగురులు తొడుక్కుంది. ఈ తరుణంలో—అవి కల్లలని తెలిస్తే ఏమవుతుంది? అది అశనిపాతంలా అక్కను తాకదూ? అంతటి భంగపాటు పొందాక అక్క జీవిస్తుందా...? రాహుల్ కోరేది ఆరతినని తెలిస్తే అతనితో వివాహానికి చచ్చినా ఒప్పుకోదు నిజం తెలిస్తే అక్క జీవితం నాశనమవుతుంది... ఏమిటీ పరీక్ష!

ఇప్పుడు తానేం చేయాలి? అక్క కోసం తను త్యాగానికి సిద్ధపడినా రాహుల్ ఒప్పుకుంటాడా? రాహుల్ ఒప్పుకున్నా అతన్ని వదులుకుని తను జీవించగలదా అలాగని, ఎన్నడూ నోరువిప్పని అక్క తనమీద కొండంత విశ్వాసంతో మనసు విప్పి చెప్పుకుంటే 'అతన్ని నేను ప్రేమిస్తున్నాను' అని చెప్పుకోవడం ఏం న్యాయం? అది విని అక్క తట్టుకోగలదా? భగవాన్! ఏం చేయాలిప్పుడు? ఏం చేయాలి?...'

తను ఏం చెప్పాలనుకుంది? ఇప్పుడేం వింటోంది?

ఆరతి తల ఆలోచనలతో వేడెక్కిపోయింది! తలలో డైనమైట్‌లు ప్రేలసాగాయి.

"అరూ! రాహుల్ ఈ పెళ్ళికి ఒప్పుకుంటాడు కదూ?" చెల్లెలి పరిస్థితి గమనించని భారతి తన ధోరణిలో అంది. ఒకవేళ అతను అంగీకరించకపోతే—అతనికి దూరమై నేను జీవించగలనంటావా? నా బ్రతుకు అంతంచేసుకోవడం మినహా నాకింక మార్గమేముంటుంది చెప్పు."

చటుక్కున అక్క నోరు మూసేసింది ఆరతి.

"లేదక్కా! అతను నిన్ను తప్పక చేసుకుంటాడు" అంది అప్రయత్నంగా.

చెల్లెల్ని ముద్దుపెట్టుకుంది భారతి. "నాకు తెలుసు, నా అరుకి అతను నచ్చుతాడని. అందుకే నిన్ను అడగనిదే ఏ విషయం చెప్పనన్నాను అమ్మతో. ఇంతవరకు అతన్ని ఆ విషయం కదపొద్దని కూడా చెప్పాను" అంది.

"నీకు బెంగేమీ వద్దక్కా! రాహుల్‌ని ఒప్పించే భారం నాది" అంటూంటే దుఃఖంతో ఆరతి గొంతుకు పూడుకుపోయింది. గబాలున బెడ్ మీద బోర్లాపడిపోయింది.

ఆ రాత్రి అక్కచెల్లెళ్ళిద్దరికీ నిద్రపట్టలేదు—ఆనందంతో ఒకరికీ, ఆవేదనతో మరొకరికీను!

## 8

తల్లిని కాదని అక్క పెళ్ళి విషయం రాహుల్‌ని తను అడిగివస్తానని బయలుదేరింది ఆరతి. ముందుగా అతని మనసు తెలుసుకోకుండా తొందరపడి అక్క విషయం చెప్పడం ఇష్టంలేదు ఆమెకు.

"మన పెళ్ళి విషయం ఆంటీతో చెప్పావా?" అని అడిగాడు రాహుల్ ఆరతిని చూస్తూనే.

నవ్వి "ముందొకమాట అడుగుతాను సూటిగా జవాబు చెబుతావా రాహుల్?" అంది.

"అడుగు." అన్నాడు నవ్వుతూ.

"మా అక్క గురించి నీ అభిప్రాయమేమిటి?"

ఆశ్చర్యపోయి "నీలాగే అందమైన అమ్మాయి. అయితే నీలా గడుగ్గాయి మాత్రం కాదు. నెమ్మదైన పిల్ల."

అన్నాడు కొంటెగా.

"అయితే ఈ గడుగ్గాయిని వదిలి, మా అక్కనే చేసుకోరాదూ!" అందామె.

చిన్నగా ఉలిక్కిపడ్డాడతను. "కోపం వచ్చిందా డియర్!" అంటూ ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

"లేదు. నిజమే చెబుతున్నాను మా అక్కను పెళ్ళిచేసుకో."

ఆమెను చటుక్కున వదిలేసి "ఏయ్ పిల్లా ఏమిటా వరాచికాలు!" అన్నాడు తెచ్చిపెట్టుకున్న కోపంతో.

"వరాచికాలు కాదు. పెద్దపిల్లకు చేయకుండా చిన్నపిల్లకు పెళ్ళిచేయరెవరూ. అందుకే అక్కయ్యకు నిన్ను అడగాలనుకుంటుంది అమ్మ. పైగా అక్కయ్య కూడా నిన్ను ప్రేమిస్తోంది..."

ఆరతివంక తెల్లబోయి చూసాడు అతను— ఆమె వదనంలో పరిహాసపు సూచనలు కనిపించడంలేదు.

"డియర్! ఏమిటిదంతా!" అన్నాడు ఆమె చుబుకంపట్టి వదనాన్ని పైకి ఎత్తుతూ.

"నేను నిజమే చెబుతున్నాను రాహుల్ నీ అభిప్రాయం తెలుసుకుందామని వచ్చాను" అందామె తల దించుకుని.

"పిచ్చిదానిలా మాట్లాడకు. ఇవేం బొమ్మల పెళ్ళిళ్ళుకాదు-చెల్లిని ప్రేమించి అక్కను పెళ్ళిచేసుకోవడానికి..." అన్నాడు సీరియస్‌గా.

"ఒకవేళ అక్కకోసం చెల్లెలు త్యాగం చేస్తానంటే!" తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అందామె.

"అబ్సర్డ్! త్యాగం, రాగం అంటూ పిచ్చి సెంటిమెంట్సుతో నువ్వు తెలివి తక్కువగా ప్రవర్తించినా అంగీకరించవలసిన అవసరం నాకులేదు కాదంటావా ఆజన్మాంతం బ్రహ్మచారిగానైనా వుండిపోతానే తప్ప మరొకర్ని పెళ్ళాడడం అసంభవం!" అతని స్వరంలో ధ్వనించిన స్థిరనిశ్చయాన్ని, ఉద్రేకాన్ని గ్రహించడంతో ఆ వాతావరణాన్ని మార్చే ఉద్దేశంతో పకపక నవ్వేసింది ఆరతి చప్పట్లు చరుస్తూ.

తెల్లబోయాడతను. "ఎందుకలా నవ్వుతున్నావ్?" అని అడిగాడు.

"ఏముంది! అబ్బాయిగారి ప్రేమ ఎంత గాఢమైందో చూద్దామని టెస్ట్‌చేయబోతే సీరియస్ అయిపోయారే!" అంది.

"థాంక్‌గాడ్! నువ్వు నిజంగానే అంటున్నావేమోనని కంగారుపడిపోయాను" అంటూ తేలికగా నిట్టూర్చాడతను ఆమెను తన బాహువుల్లోకి తీసుకుంటూ.

* * *

"ఆయన ఏమన్నారే ఆరూ!" అంటూ ఆసక్తిగా అడిగింది భారతి తిరిగివచ్చిన చెల్లెల్ని.

ఆరతి నవ్వు తెచ్చిపెట్టుకొని "నేను చెప్పలే-నీవంటి అందాలరాశి, సుగుణాల ప్రోవుల ప్రేమను ధిక్కరించే మగవాడు వుండడని? రాహుల్ కూడా నిన్ను

గాఢంగా ప్రేమిస్తున్నాడట. నీతో పెళ్ళి అనగానే ఎగిరి గంతేసాడు" అంది.

ఆనందంతో చెల్లెల్ని కావలించుకుంది భారతి

"ఆఁ అఁ... అసు మరి! అతను కొన్ని షరతులు పెట్టాడు" అని చెల్లెలు అనడంతో ఓ క్షణం గుండె కొట్టుకోవడం మానేసింది భారతికి. కట్నం ప్రాబ్లెం ఏమోనని.

"ఏమిటే అది?" అంది ఆతృతగా.

"సింపుల్ తన కాబోయే భార్య మాడర్న్ డ్రెస్‌లో చలాకీగా వుండాలట. పైగా అతని కిష్టమైన పేరు అనామిక అట. నిన్ను ఆ పేరుతోనే పిల్చుకుంటాడట. నీకు అభ్యంతరమా అని అడిగాడు. ఏమాత్రం కాదని చెప్పేసాను. అతని షరతులన్నీ నీ తరఫున నేనే ఒప్పేసుకున్నాను..."

"ఒప్పేసుకున్నావా?"

"ఏం తప్పుచేసానా అక్కా?" అంది ఆరతి అమాయకంగా.

"అదికాదే! పేరు సరేగాని, మాడర్న్ డ్రెస్ అంటే నా కిష్టం వుండదని నీకు తెలుసుగా? చీరెలు మాని చుడీదార్ తొడుక్కోవాలంటే నా కెలాగో వుంటుందే" అంది

"నీ కెందుకు. నేను అలవాటు చేస్తానుగా" అంటూ అక్కను చెక్కిలిమీద ముద్దుపెట్టుకుంది ఆరతి, లోలోపల మనసు మూగగా రోదిస్తూంటే.

ఆనాటినుంచీ భారతి డ్రెస్, అలంకరణ మారిపోయాయి. మాడర్న్ డ్రెస్‌లో తయారయిన భారతిని ఆరతి అని పొరబడసాగారంతా. అనవాలుకోసం అంటూ తాను చీరెల్లోకి మారిపోయింది ఆరతి. అంతేగాదు. గడుగ్గాయితనం పోయి నెమ్మదిలోకి వచ్చేసింది.

## 9

భారతి మెళ్లో రాహుల్ తాళి కడుతూంటే పందిరి రాట చాటున నిలుచుని చూస్తూన్న ఆరతి చెక్కిళ్ళ పైనకన్నీళ్లు జాలువారాయి

"నిన్ను మోసగించినందుకు నన్ను క్షమించు రాహుల్' అక్కకోసం ఈ త్యాగంచేయక తప్పలేదు' అనుకుంది మదిలో. ఆమె హృదయం బరువెక్కింది. మనసు రోదిస్తోంది

• • •

అనుకున్నట్లే రాహుల్‌కి ఢిల్లీ బదిలీ అయింది... ఆరోజే భార్యతో బయలుదేరాడతను

వారికి సెండాఫ్ ఇచ్చేందుకని స్టేషన్ కెళ్ళింది ఆరతి.

జి.టి. ఎక్స్‌ప్రెస్ కదలడానికి సిద్ధంగా వుంది. కంపార్ట్‌మెంట్‌లో కిటికీ దగ్గర కూర్చుంది భారతి.

అక్క కళ్ళలో మెరుపు, వదనంలో తృప్తిచూసి ఆరతికి ఆనందంగా వుంది. తాను కోరుకున్నది సాధించినట్లనిపించింది.

అయితే—

హృదయాంతరాళలో ఎక్కడో కలుక్కుమంటోంది. సాగరాల ఘోష తుఫాన్ హోరు...మనసంతా అలజడికి గురయింది...అల్లకల్లోలంగా వుంది.

'రాహుల్! నా రాహుల్! నన్ను విడిచి దూరంగా వెళ్ళిపోతున్నావా? కనీసం కళ్ళతో చూసుకునేందుకైనా లేకుండా...నేను చేసిన పాపానికి శిక్షగా...నామీద అలిగి...నాకు దూరమవుతున్నావా రాహుల్! ఎప్పటికైనా నిజం వెల్లడయితే నాకోసం ఓ కన్నీటి చుక్కను కార్చగలవా?... నన్ను క్షమించగలవా రాహుల్!...' అంటూ ఘోషిస్తోంది ఆమె హృదయం.

గార్డ్ విజిల్ ఊదడంతో చిరునవ్వుతో ఆరతి దగ్గర సెలవుతీసుకొని రైలెక్కాడు రాహుల్.

ఆరతి కన్నుల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

చెల్లెలిమీద ఎడబాటుతో బాధపడుతుందనుకున్నాడు ఆమెను ఆరతిగానే భావిస్తున్న రాహుల్.

అక్కవంక చూసింది ఆరతి-ఆమె కన్నుల్లో నీటితెరలు...

'నువ్వు అదృష్టవంతురాలివి అక్కా' అనుకుంది ఆప్యాయంగా ఆమె చేయి నొక్కుతూ.

రైలు కదిలింది.

భారతి చేయి ఊపింది.

రాహుల్ కూడా చేయి ఊపాడు.

రైలు క్రమక్రమంగా దూరం అవుతూంటే ఆరతికళ్ళు గుమ్మంలో నిలుచుని చేయి ఊపుతున్న రాహుల్ మీదే వున్నాయి.

తన ప్రాణంలో ప్రాణం-వేరయిపోతున్నట్లు ఆమె హృదయం గిలగిలలాడింది.

ఆమె చేయి వూపుతున్నట్లు...ఆమె హృదయం గిలగిలలాడింది

ఆమె చేయి ఊపుతూనే వుంది.

"రాహుల్! నా రాహుల్! నన్ను విడిచి వెళ్ళిపోతున్నావా!" ఆవేదనతో మనసు రోదిస్తూంటే ఆరతి కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

కన్నీటి తెరల మధ్య-దూరమవుతూన్న రైలు మసకమసకగా కనిపిస్తూంటే- 'రాహుల్! డోంట్ లీవ్ మి, డియర్!' అంటూ హృదయం ఆక్రోశిస్తూంటే యాంత్రికంగా చేయి ఊపుతూ. ప్లాట్‌ఫాం మీద మిగిలిపోయింది ఆరతి.

* * *